క్లుప్తంగా

చిందాడగరువులో వైద్య శిబిరం


శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

అమలాపురం రూరల్: మండలంలోని చిందాడ గరువు గ్రామ సచివాలయం వద్ద గురువారం కిమ్స్ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని సర్పంచ్ పానకల గణేష్ ప్రారంభించారు. శిబిరంలో జనరల్, కంటి, గుండె సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మోటూరి కనకదుర్గ, వైద్యులు క్రాంతి, మౌనిక, తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

తాళ్లరేవు: తాళ్లరేవు 33/11 కేవీ సబ్‌స్టేషన్, చొల్లంగి సబ్‌స్టేషన్లలో వార్షిక మరమ్మతుల నిమిత్తం ఆయా పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని కాకినాడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఏచూరి మరణం తీరని లోటు


గొల్లవిల్లిలో సీతారాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఉప్పలగుప్తం: కార్మిక యోధుడు ఏచూరి సీతారాం మరణం కమ్యూనిస్టు లోకానికి తీరని లోటని సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని గొల్లవిల్లిలో గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో సీతారాం సంస్మరణ సభ నిర్వహించారు. సీతారాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జి.దుర్గాప్రసాద్, కోటుం బేబి గంగారత్నం, కె.పరిపూర్ణ, ఎస్.సుబ్బలక్ష్మి, పి.సత్యనారాయణ, ఆకుల సూరిబాబు, వై.రాంబాబు, యు.అంజలిరావు, యు.లక్ష్మి, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్ర వేడుకలకు పందిరి రాట ముహూర్తం


గ్రాంటు గ్రామంలో పందిరి రాట ముహూర్తం చేస్తున్న అర్చకులు

తాళ్లరేవు: వచ్చే నెల 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకూ నిర్వహించే దసరా శరన్నవరాత్ర వేడుకలకు సంబంధించి పందిరి రాట ముహూర్తం గురువారం నిర్వహించారు. మండల పరిధిలోని పి.మల్లవరం పంచాయతీ గ్రాంటు గ్రామంలో ఓఎన్‌జీసీ కంపెనీ వద్ద గల శ్రీపాల కనకదుర్గమ్మ ఆలయం వద్ద ఏటా దేవీ నవరాత్రులను ఘనంగా జరుపుతారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు రాయప్రోలు కామేశ్వరశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి పందిరి రాట ముహూర్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలి

అమలాపురం టౌన్: వేద విద్యలో ఉత్తీర్ణత పొంది నిరుద్యోగులుగా ఉన్నవారు నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు పొందేందుకు ఈనెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్(ఏసీ) మాచిరాజు లక్ష్మీనారాయణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన వేద నిరుద్యోగులు దరఖాస్తుతో పాటు తమ వేద విద్య ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్, బ్యాంక్ ఐఎఫ్ఎస్‌సీ కోడ్ నకళ్లు, ఏ ఉద్యోగం చేయడం లేదని స్వీయ వాంగ్మూల ధ్రువీకరణ పత్రం జత చేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94416 38442 సెల్ నంబరులో సంప్రదించాలని కోరారు.

30 మంది రక్తదానం


శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

అమలాపురం టౌన్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పుట్టిన రోజు సందర్భంగా జిల్లా బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరం జరిగింది. శిబిరంలో 30 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో యువ మోర్చా అధ్యక్షుడు కొండేటి ఈశ్వర్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, యువ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కాలాబత్తుల చిన్నారి, జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు శివాజీ, అరిగెల తేజ వెంకటేష్, గనిశెట్టి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

గోతులైనా పూడ్చండి మహాప్రభో

- ప్రధాన రహదారులపై గుంతలతో ప్రజల అవస్థలు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు


సుంకరపాలెం వద్ద పెద్ద పెద్ద గోతులతో ప్రమాదకరంగా మారిన యానాం-ద్రాక్షారామ రోడ్డు

తాళ్లరేవు: ఏ రహదారి చూసినా ఏమున్నది గర్వకారణం.. సర్వం గుంతలమయం.. రోడ్లన్నీ గోతులతో అధ్వానంగా మారడంతో ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. ఆఖరికి ప్రధాన రహదారులు సైతం అడుగుఅడుగుకో గుంత అన్న చందంగా దెబ్బతిన్నా ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడంతో వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. నిత్యం వేలాది మంది సంచరించే రహదారుల్లోనూ ప్రయాణం ప్రహసనంగా మారడంతో కొత్త రోడ్లు దేవుడెరుగు.. గోతులైనా పూడ్చండి మహాప్రభో అని ప్రజలు వేడుకుంటున్నారు.

ప్రయాణం.. ప్రహసనం..

- తాళ్లరేవు మండల పరిధిలోని యానాం-ద్రాక్షారామ రహదారిలో నిత్యం వేలాది మంది ప్రయాణిస్తూ ఉంటారు. అయితే రహదారి పెద్ద పెద్ద గోతులు, గొప్పులతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ ప్రాంతంలో అనేక పాఠశాలలు, కళాశాలలు ఉండడంతో విద్యార్థులు మార్గం మధ్యలో ప్రమాదాల బారిన పడి గాయాల పాలవుతుండడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పైగా ఇదే దారిలో అనేక వ్యాపార దుకాణాలు ఉంటాయి. వర్షాలొచ్చినపుడు రోడ్డుపై గోతుల్లో నీరు నిలిచిపోయి వాహనాలు వెళ్లినపుడు బురద తమ దుకాణాలపై పడుతుందని వ్యాపారులు వాపోతున్నారు. డ్రైనేజీ సౌకర్యం సైతం లేకపోవడంతో ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోయి నిత్యం అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- మండలంలోని జి.వేమవరం ప్రధాన రహదారి ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోకుండా ఉంది. అధ్వానంగా తయారైన ఈ రోడ్డుని బాగు చేయాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడు కరవయ్యాడని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక సర్పంచ్ పలుమార్లు తన సొంత నిధులతో గుంతలను పూడ్చి మరమ్మతులు చేశారు. అయినప్పటికీ వర్షాల కారణంగా రహదారి కొట్టుకుపోవడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి రహదారులను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.


జి.వేమవరం ప్రధాన రహదారి దుస్థితి

- యానాం-ద్రాక్షారామ రహదారి దుస్థితిపై పలుమార్లు స్థానికులు, వ్యాపారులు ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు దృష్టికి తీసుకువెళ్లగా ఆయన ఆదేశాలతో లక్షలాది రూపాయలు వెచ్చించి మరమ్మతుల పనులు చేపట్టారు. అయితే కొద్దిరోజులకే వర్షాలకు రహదారి కొట్టుకుపోయి పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. దీంతో రహదారి మరమ్మతులకు ఖర్చు చేసిన నిధులు నీళ్లపాలు అయ్యాయంటూ స్థానికులు వాపోతున్నారు.

ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం



సుంకరపాలెం ప్రధాన రహదారి అధ్వానంగా తయారై నిత్యం నరకయాతన అనుభవిస్తున్నాం. ఈ రహదారిలో రోజూ పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులతో పాటు అటు మురమళ్ల, ఇటు ద్రాక్షారామ ఆలయాలకు వెళ్లే భక్తులు ప్రయాణిస్తూ ఉంటారు. గోతులమయంగా తయారైన ఈ రోడ్డులో నిత్యం ఏదో ఒక ప్రమాదం జరిగి వాహనదారులు గాయాలపాలవుతున్నారు. తక్షణమే రహదారి నిర్మాణాన్ని చేపట్టాలి.

– అడబాల శివ, టీస్టాల్ యజమాని, సుంకరపాలెం బైపాస్ జంక్షన్

పట్టించుకునేవారు కరవు



జాతీయ రహదారి–216 నుంచి జి.వేమవరం వెళ్లే రహదారిలో పెద్ద పెద్ద గోతులు పడిపోయాయి. నిత్యం అనేక మంది ఈ మార్గంలో ప్రయాణిస్తూ ఉంటారు. గోతుల కారణంగా నిత్యం ఎవరొకరు ప్రమాదాల బారిన పడుతున్నారు. అయినా ఈ రహదారిని పట్టించుకునే వారు మాత్రం కరవయ్యారు. ఇకనైనా మమ్మల్ని కష్టాల నుంచి గట్టెక్కించాలని కోరుతున్నాం.

– శ్రీపాదం శ్రీనివాస్, గ్రామస్తుడు, జి.వేమవరం

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


వ్యక్తిగత పరిశుభ్రతపై మానవహారం ఏర్పాటు చేస్తున్న విద్యార్థులు


జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అధికారులు


స్వచ్ఛభారత్ నిర్వహిస్తున్న నెహ్రూ యువ కేంద్ర వలంటీర్లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

అమలాపురం టౌన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా స్వచ్ఛత సాధ్యమని జిల్లా గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ(ఆర్‌డబ్ల్యూఎస్) ఇంజినీరింగ్ అధికారి ఎం.సురేష్‌బాబు పిలుపునిచ్చారు. స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద గురువారం జరిగిన స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో ఆయన పాల్గొని పరిసరాలను పరిశుభ్రం చేశారు. చెత్త కుప్పలను తొలగించి పారిశుధ్య పనులు చేపట్టారు. అనంతరం కార్యాలయ సిబ్బంది స్వచ్ఛతాహి సేవ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకూ జిల్లాలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో డీఈఈ పార్థసారథి, ఏఈలు చినబాబు, సురేష్, దీపక, జ్యోతి, సుకీర్తి, అనురాధ, కార్యాలయ సూపరింటెండెంట్ మౌనిక కుమారి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

అల్లవరం: స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో విద్యార్థులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు గురువారం నిర్వహించారు. కొమరగిరిపట్నం ఉన్నత పాఠశాలలో సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించి వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. బోడసకుర్రులో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించి, వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేసి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శులు ఎన్‌వీవీ సత్యనారాయణ, దుర్గా శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల స్వచ్ఛభారత్

యానాం: యువజన వ్యవహారాలు, క్రీడామంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేంద్ర వలంటీర్లు, వివిధ కళాశాలల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు కలిసి గురువారం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్తను, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర జిల్లా యోజన అధికారి తిర్రి గోపి, ఎన్ఎస్ఎస్ రీజినల్ కోఆర్డినేటర్ చింతపల్లి కృష్ణ సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


గోపవరం పాఠశాలలో శ్రమదానం చేస్తున్న సర్పంచ్ కుంచే బుల్లియ్య

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఉప్పలగుప్తం: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ కుంచే బుల్లియ్య అన్నారు. మండలంలోని గోపవరం గ్రామంలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పాఠశాలలో స్వచ్ఛభారత్ లోగో ప్రదర్శించి స్వచ్ఛతా ర్యాలీ, మానవహారం, శ్రమదానం చేపట్టారు. కార్యక్రమంలో అయితాబత్తుల వెంకటకృష్ణారావు, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, కుంచే స్వామి, పెమ్మిరెడ్డి సత్యనారాయణ, పంచాయితీ కార్యదర్శి బి.సుమ, హెల్త్ సూపర్‌వైజర్ వి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


స్వీటీ


వర్షిణి


నవ్యశ్రీ

అమలాపురం రూరల్: కాకినాడలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి సెపక్ తక్ర క్రీడ పోటీల్లో మండలంలోని ఇందుపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థినులు వర్షిణి, స్వీటీ, నవ్యశ్రీ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పీఈటీ నరసింహరావు తెలిపారు. వచ్చే నెల ఏలూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని హెచ్ఎం వి.శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థులను సర్పంచ్ చొల్లంగి శివాళిని, ఎంపీటీసీ రాంబాబు, విద్యా కమిటీ చైర్‌పర్సన్ మంగతాయారు, వైస్ చైర్మన్ రాజా రమేష్, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

అమలాపురంలో కాంగ్రెస్ ధర్నా

అమలాపురం టౌన్: ఏఐసీసీ జాతీయ నేత రాహుల్ గాంధీపై శివసేన ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక గడియారం స్తంభం సెంటరులో గురువారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు, పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీను, పట్టణ పార్టీ అధ్యక్షుడు వంటెద్దు బాబి, యార్లగడ్డ రవీంద్ర, అయితాబత్తుల సుభాషిణి, కుడుపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు మున్సిపల్ చైర్‌పర్సన్ పరామర్శ


క్షతగాత్రులను పరామర్శిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి

అమలాపురం టౌన్: రావులచెరువు ప్రాంతంలో బాణసంచా తయారీతో పేలుడు ప్రమాదం సంభవించి తునాతునకలైన ఇంటిని మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి గురువారం సందర్శించారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి స్థానిక కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను నాగేంద్రమణి పరామర్శించారు. పట్టణ సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో ఘటనపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. చికిత్స పొందుతున్న క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని సీఐ వీరబాబు తెలిపారు.

లక్ష్మణాచార్యులుకు సత్కారం


యానాంలో లక్ష్మణాచార్యులును సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

యానాం: యానాంలో కొలువైన భూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయ అర్చకులు పెద్దింటి లక్ష్మణాచార్యులును గురువారం ఆచార్య శిరోమణి బిరుదుతో సత్కరించారు. స్థానిక విష్ణాలయం వీధిలో వినాయక ఉత్సవాల ముగింపు సందర్భంగా ఉత్సవ కమిటీ ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణాచార్యులు ఉత్సవ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి హామీ గ్రామ సభ


గొల్లవిల్లిలో నిర్వహిస్తున్న ఉపాధి గ్రామ సభ

ఉప్పలగుప్తం: ఉపాధి హామీ సామాజిక తనిఖీల్లో భాగంగా గురువారం గొల్లవిల్లి పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ నిర్వహించారు. సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో గ్రామంలో జరిగిన 82 పనులకు సంబంధించి తనిఖీ నిర్వహించారు. సామాజిక తనిఖీని ఎస్ఆర్‌పీ బి.దాసు పరిశీలించారు. 2023–24 సంబంధించి చేపట్టిన ఉపాధి పనులపై ఈనెల 20 వరకు గ్రామాల్లో సామాజిక తనిఖీలు పూర్తిస్థాయిలో చేపట్టి అనంతరం మండల స్థాయిలో మండలంలోని 17 గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులపై మండల స్థాయి సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు పరమట సత్యనారాయణ, చీకట్ల ఏసుబాబు, మంచెం బాలకృష్ణ, జొన్నాడ చిన్ని, ఏపీవో వి.రాజామణి, పంచాయతీ కార్యదర్శి పరమట సాయిబాబు, ఉపాధి టీఏ పార్వతి, ఫీల్డ్ అసిస్టెంట్ ముళ్ల ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడులు తగ్గించుకోవాలి


నల్లిమిల్లిలో జరిగిన పొలంబడిలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి బోస్‌బాబు

అమలాపురం రూరల్: రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించి పెట్టుబడులు తగ్గించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి వి.బోస్‌బాబు సూచించారు. మండలంలోని నల్లమిల్లి గ్రామంలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రైతు వాకపల్లి శ్రీనివాస్ పొలంలో ఆయన ఎండు తెగులు ఉధృతిని గమనించి రైతులు నత్రజని ఎరువులు తగ్గించాలని సూచించారు. సాగులో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించడం వల్ల తెగుళ్లు ఆశించవని, పంట ఆరోగ్యంగా పెరుగుతుందన్నారు. అనంతరం వరి పొలం వద్ద ఏర్పాటు చేసిన శాశ్వత జీవామృతం కుండీని అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ఎంఏ షంషి, ప్రకృతి వ్యవసాయాధికారి కె.శ్రీనివాస్, ఏఓ కె.ధర్మప్రసాద్, ఏఈవో డి.ప్రేమకుమార్, ఎంటీ సూరిబాబు, వీఏఏఎస్ సందీప్, నవీన్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సహారా చెల్లింపులు తక్షణమే చేయాలి


అమలాపురంలో ఎంపీ హరీష్‌కు వినతి పత్రం అందిస్తున్న సహారా ఏజెంట్లు

అమలాపురం టౌన్: సహారా ఇండియా పరివార్ సంస్థ దేశం మొత్తం మీద ఖాతాదారులకు పేమెంట్స్ చెల్లించకుండా జాప్యం చేస్తోందని పలు జిల్లాలకు చెందిన సహారా ఏజెంట్లు అమలాపురంలో ఎంపీ గంటి హరీష్ మాథూర్‌ను గురువారం కలిసి వినతి పత్రం అందించారు. కేంద్ర ప్రభుత్వం పోర్టల్ యాప్ రిలీజ్ చేసి ఏడాది కావొస్తున్నా రూ.25 వేల కోట్లు ఉంచుకుని ఏజెంట్లకు చెల్లించకపోవడం వల్ల తామంతా చాలా ఇబ్బందులు పడుతున్నామని ఎంపీకి వివరించారు. ఎంపీని కలిసిన వారిలో సుంకరపాలెం, కాకినాడ, రాజమహేంద్రవరం, తాడేపల్లిగూడెం, పెద్దాపురం, గోకవరం సహారా బ్రాంచిలకు చెందిన ఏజెంట్లు వడ్డి ఏడుకొండలు, కె.అప్పారావు, సత్యనారాయణ, శ్రీనివాస్, రవిబాబు, ప్రభావతి ఉన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లిన క్రీడాకారులు


కారైకల్ బయలుదేరి వెళ్లిన యానాం విద్యార్థులు

యానాం: పుదుచ్చేరి వద్ద ఉన్న కారైకల్‌లో ఈ నెల 21, 22 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు యానాం నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 72 మంది బాలబాలికలు గురువారం బయలుదేరి వెళ్లారు. అండర్–17, 19 వాలీబాల్, అండర్–14, 17, 19 హ్యాండ్ బాల్ పోటీల్లో విద్యార్థులు పాల్గొననున్నారని ఆర్గనైజింగ్ సెక్రటరీ వినకోటి సన్యాసిరావు తెలిపారు. విద్యార్థులతో పాటు పీఈటీలు పీవీఎస్ ప్రకాష్, పాము సత్యనారాయణ, కొప్పనాతి రమేష్, భాస్కర్, వడ్డి వరప్రసాద్ తదితరులు ఉన్నారు. వారందరికీ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్ పలు సూచనలు చేశారు.

సాహితీ సూర్యుడు బోయి భీమన్న


బోయి భీమన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీశ్రీ కళా వేదిక ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఆధునిక తెలుగు సాహిత్యాన్ని తేజోవంతం చేసిన సాహితీ సూర్యుడు మహా కవి డాక్టర్ బోయి భీమన్న అని శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కత్తిమండ ప్రతాప్ అన్నారు. స్థానిక డాబా గార్డెన్స్‌లో గురువారం జరిగిన బోయి భీమన్న జయంతి సభలో భీమన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ప్రతాప్ మాట్లాడుతూ మహాకవి బోయి భీమన్న వైవిధ్యమైన రచనలతో సామాజిక పునర్నిర్మాణానికి పునాదులు వేశారన్నారు. కార్యక్రమంలో శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, జిల్లా కన్వీనర్ బీవీవీ సత్యనారాయణ, జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శి మాకే బాలార్జున సత్యనారాయణ, కడలి సత్యనారాయణ, పసలపూడి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా అమ్మవార్ల జాతర


పెదబొడ్డు వెంకటాయపాలెంలో నిర్వహిస్తున్న మహాలక్ష్మి అమ్మవార్ల జాతర

తాళ్లరేవు: మండలంలోని చినబొడ్డు వెంకటాయపాలెం, పెదబొడ్డు వెంకటాయపాలెం గ్రామాల్లో గ్రామదేవత మహాలక్ష్మి అమ్మవార్ల జాతర కన్నుల పండువగా నిర్వహించారు. బుధవారం రాత్రి అమ్మవార్ల జాతర సందర్భంగా గరగల నృత్యాలు, డప్పుల వాయిద్యాలతో సందడిగా నెలకొంది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ముఖ్యంగా రెండు గ్రామాల్లో భారీ ఖర్చుతో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామ పెద్దల పర్యవేక్షణలో ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించారు. జాతర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ రఘువీర్ కృష్ణ, కాకినాడ రూరల్ సీఐ చైతన్య కృష్ణ, కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణల ఆధ్వర్యంలో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు.

ఊయల మండపం ఏర్పాటు

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ చినబొడ్డు వెంకటాయపాలెం గ్రామదేవత మహాలక్ష్మి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఊయల మండపం ఏర్పాటు చేశారు. తీర్థ మహోత్సవాల్లో భాగంగా గురువారం ఊయలసేవ నిర్వహించారు. గ్రామానికి చెందిన చెక్కా చిన్నకామేశ్వరరావు సుమారు రూ.1.65 లక్షలతో ఊయల మండపం, చెక్క ఊయల రూ.62 వేలతో నిర్మించారు. ఊయలకు ప్రత్యేక గొలుసును కర్రి మీరాసాహెబ్, సూర్యకాంతం కుమారులు రూ.30 వేలతో సమకూర్చారు.

బాణసంచా నిల్వల స్వాధీనం

అమలాపురం టౌన్: ఇటీవల అమలాపురంలో జరిగిన బాణసంచా విస్ఫోటనంతో ఓ ఇల్లు ధ్వంసమై 14 మంది గాయపడిన నేపథ్యంలో పట్టణ పోలీసులు అక్రమ నిల్వలపై దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా స్థానిక మార్కెట్ ఏరియా, అమలాపురం రూరల్ మండలం తోట్లపాలెంలో గురువారం రాత్రి ఏకకాలంలో మెరుపు దాడులు చేసి బాణసంచా అక్రమ నిల్వలు గుర్తించారు. పట్టణ సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో ఎస్సై కిశోర్‌బాబు, సిబ్బంది ఈ దాడులు చేశారు. రెండు చోట్ల అప్పటికే తయారు చేసిన బాణసంచా, దాని తయారీకి ఉపయోగించే మందులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమ బాణసంచా నిల్వలు కలిగిఉన్న తోట్లపాలేనికి చెందిన చవ్వాకుల పరశురాముడు, మార్కెట్ ప్రాంతానికి చెందిన అరిగెల నటరాజ్‌పై కేసులు నమోదు చేసినట్లు సీఐ వివరించారు. రెండు చోట్ల దాదాపు రూ.20 వేల విలువైన బాణసంచా స్వాధీనం చేసుకున్నారు.

గణపతికి రూ.5 నాణేల దండ సమర్పణ

అమలాపురం టౌన్: స్థానిక కల్వకొలనువీధిలోని బాల గణపతి ఉత్సవాల్లో భాగంగా భారీ ఊరేగింపు, నిమజ్జనం సందర్భంగా స్వామికి రూ.5 కొత్త నాణేలతో తయారు చేసిన దండను గురువారం సమర్పించారు. మొత్తం 600 నాణేలతో దండను తయారుచేసినట్లు పిండి బాబి సోదరులు తెలిపారు. కార్యక్రమంలో కల్వకొలను వీధికి చెందిన గోకరకొండ సూరిబాబు, గునిశెట్టి రమేష్, కల్వకొలను సతీష్ పాల్గొన్నారు.

కాట్రేనికోనలో పౌష్టికాహార మాసోత్సవాలు


సీమంతాలు నిర్వహించిన ఐసీడీఎస్ సిబ్బంది

కాట్రేనికోన: స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశపు హాలులో ముమ్మిడివరం ఐసీడీఎస్ సీడీపీఓ ఐ.విమల ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి సర్పంచ్ గంటి వెంకట సుధాకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ విమల మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పౌష్టికాహారం ఆవశ్యకతను వివరించారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం సుమారు 50 మందికి సామూహిక సీమంతాలు, పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటచలం, సూపర్‌వైజర్లు తులసి, ఎల్‌వీ రమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.